ప్రతి పేదవాడికి ఆర్థిక భద్రత


ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- గృహ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత

సోమశిల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇంటి స్థలాన్ని మంజూరు చేయడమే కాక ఆ భూమికి రిజిస్ట్రేషన్ చేసి శాశ్వత ఆర్థిక భద్రత కల్పించారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం 'విజయీభవ యాత్ర' కార్యక్రమంలో భాగంగా అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడులో జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇళ్ల లబ్ధిదారులకు ప్రోత్సాహం అందించడమే కాక వారి స్థలాలకు రిజిస్ట్రేషన్లు సైతం చేసి శాశ్వత హక్కు కల్పించారని తెలిపారు. అనంతరం కామిరెడ్డిపాడులో మరమ్మతులు చేయించిన వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే మేకపాటి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. గతంలో కామిరెడ్డిపాడు నాయకులు వాటర్‌ప్లాంట్ మరమ్మతుల గురించి తన దృష్టికి తీసుకురావడంతో నిధులు అందజేశామని, ప్లాంట్ మరమ్మతులు పూర్తయి ప్రజలకు మంచినీరు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు.

క్యాన్సర్ బాధితురాలికి సాయం

గౌరవరం గ్రామంలో విజయీభవయాత్రలో భాగంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పర్యటిస్తున్న సమయంలో క్యాన్సర్‌తో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఓ కుటుంబానికి రూ.30 వేల సొంత నిధులను అందజేసి అండగా నిలిచారు. గ్రామానికి చెందిన దావా రత్నమ్మ క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందుతున్నారు. రవాణా ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే రూ.30 వేలు అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, జేసీఎస్ కన్వీనర్ అంకిరెడ్డి, బొమ్మవరం సర్పంచ్ లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్ గోపిరెడ్డి పద్మజారెడ్డి, బట్రెడ్డి జనార్దనరెడ్డి, బి.కొండయ్య, ఎ.బాబురావు, జి.వెంకటమస్తానయ్య, పెంచలయ్య, దానియేలు, కార్తీక్, సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విజయసాయిరెడ్డిని కలిసిన మేకపాటి


విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి

ఉదయగిరి: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ సమన్వయకర్త వి.విజయసాయిరెడ్డిని గురువారం ఆ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉదయగిరిలో వైఎస్సార్‌సీపీ భారీ మెజారిటీతో గెలుపొందే అంశంపై, తాజా రాజకీయ పరిణామాలపై రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.చంద్రశేఖర్‌రెడ్డిలతో చర్చించారు. ఆయన వెంట యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి ఉన్నారు.

నేడు కృష్ణారెడ్డిపాళెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం సచివాలయం పరిధిలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యాధికారిణి గీతారెడ్డి గురువారం తెలిపారు. ఈ వైద్యశిబిరంలో నిపుణులైన వైద్యులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

నేడు విజయ సంకల్పయాత్ర

దుత్తలూరు: మండలంలోని తెడ్డుపాడు, నర్రవాడ గ్రామాల్లో శుక్రవారం విజయ సంకల్ప యాత్ర నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, యువ నాయకుడు అభినవ్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నర్రవాడలో, 6 గంటలకు తెడ్డుపాడులో ఈ విజయసంకల్ప యాత్ర జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

గర్భిణులకు ప్రత్యేక పోషణ అవసరం


గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనూషాకుమారి

ఆత్మకూరురూరల్: గర్భిణులు, బాలింతలు నిత్యం ప్రత్యేక పోషణ ద్వారా తల్లీ బిడ్డ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.అనూషా కుమారి సూచించారు. మండలంలోని వెన్నవాడ సచివాలయం పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులతోపాటు చిన్నారుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సైదా, కృష్ణారెడ్డి, ఎంఎల్‌హెచ్‌ఈ సుప్రియ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నారాయణమ్మ, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం


విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ శైలజ

కొండాపురం: మండలంలోని పార్లపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లను స్థానిక సర్పంచ్ పెనుబాకల శైలజ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజల ముంగిటకే పథకాలు అందేలా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అబ్దుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు పెనుబాకుల రవీంద్రరెడ్డి, గడ్డం ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మర్రిపాడు: మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం సిద్ధిస్తుందని సీడీపీఓ ఎం.పద్మావతి తెలిపారు. మర్రిపాడు మండలం పొంగూరుకండ్రిక అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని సీడీపీఓ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత, ఐరన్, విటమిన్–సి లోపం రాకుండా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపల్లి సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, గర్భిణులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


కిడ్నీ డే నిర్వహిస్తున్న డాక్టర్లు

ఆత్మకూరు: శరీర భాగాల్లో కిడ్నీ అతి ముఖ్యమైనదని, ఆహారపు అలవాట్లతో కిడ్నీ వ్యాధులు సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని, ప్రతి ఒక్కరూ కిడ్నీ సంబంధిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం అన్నారు. వరల్డ్ కిడ్నీ డేను పురస్కరించుకొని ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శేషారత్నం మాట్లాడుతూ కిడ్నీ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. తాజా ఆహారంతో కిడ్నీ వ్యాధులను జయించవచ్చన్నారు. విపరీతంగా అనవసరంగా మందులు వాడితే ఆ ప్రభావం కిడ్నీలపై పడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ ఉషాసుందరి, నెఫ్రాలజీ డాక్టర్ సనీష్‌కుమార్, కిడ్నీ యూనిట్ మేనేజర్ కె.రవిరాజు, ఏఓ శ్రీనివాసులురెడ్డి, ఆఫీస్, నర్సింగ్ సూపరింటెండెంట్లు మున్వర్, కృష్ణకుమారి, హెడ్‌నర్సు ధనకుమారి, సిబ్బంది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరికలు


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరికలు జరుగుతున్నాయని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. గురువారం మర్రిపాడు మండలం బ్రహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో సింగనపల్లికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే మేకపాటి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచితస్థానం కల్పిస్తామని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రేవూరు వేణుగోపాల్‌రెడ్డి, కాశీరెడ్డి, సీహెచ్ భాస్కర్‌రెడ్డి, షేక్ రసూల్, సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


సరస్వతీదేవి పూజలో పాల్గొన్న విద్యార్థులు

చేజర్ల: త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని చేజర్ల జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి.హైమావతి పేర్కొన్నారు. గురువారం ఆ పాఠశాలలో సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్‌లు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 మస్తానయ్య, పీడీ మల్లికార్జున, ఉపాధ్యాయులు ఇందుమతిరాణి, ప్రసాద్‌రెడ్డి, రమేష్‌బాబు, డ్రాయింగ్ మాస్టర్ తోట కిషోర్, పూర్వ విద్యార్థి కేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా రైతు సమాఖ్యల ఏర్పాటు


మాట్లాడుతున్న ఎఫ్‌బీఓ ఏపీఎం సరస్వతి

ఆత్మకూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆత్మకూరు పట్టణంలోని వైఎస్సార్ ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం బి.వెంకమ్మ ఆధ్వర్యంలో మహిళా రైతు సమాఖ్యలను గురువారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఫ్‌బీఓ ఏపీఎం సరస్వతి హాజరయ్యారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన పొదుపు సంఘాల మహిళలు, వీఓఏలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీఓ ఏపీఎం సరస్వతి మాట్లాడుతూ రైతులు పండించిన ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఈ సమాఖ్యలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 75 రైతు సంఘాల సమాఖ్యలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 15 మంది లీడర్లు, 15 మంది బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. వీరు గ్రామాల్లో ఓబీలను (సహాయకులను) ఎన్నుకుంటారని తెలిపారు. ఈ సమాఖ్యల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ మహిళా రైతులను ప్రోత్సహించేలా వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సమాఖ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా వి.మంజుల, కార్యదర్శిగా ఎం.సుధ, కోశాధికారిగా ఎస్‌కే గౌసియా, ఉపాధ్యక్షురాలిగా రాజేశ్వరి, సహాయ కార్యదర్శిగా పద్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏపీఎం తెలిపారు.

ఆస్పత్రికి వెళుతుండగా మృతి

సంగం: అనారోగ్యంతో బాధపడుతున్న కావలికి చెందిన ప్రభు అనే వ్యక్తి స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గురువారం మృతిచెందాడు. కామెర్ల వ్యాధితో బాధపడుతున్న ప్రభుని ఆయన తల్లిదండ్రులు ఆర్టీసీ బస్సులో కావలి నుంచి కలిగిరికి వచ్చి అక్కడ బంధువుల వద్ద నగదు తీసుకుని నెల్లూరు ఆస్పత్రికి వెళుతున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు సంగం వద్దకు రాగానే ప్రభు అపస్మారకస్థితికి చేరుకున్నాడు. వెంటనే తల్లిదండ్రులు స్థానిక వైద్యశాలకు తరలిస్తుండగా ప్రభు మృతిచెందాడు. మృతదేహాన్ని ప్రైవేట్ వాహనంలో కావలికి తీసుకెళ్లారు. కొడుకు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

నేడు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి విజయీభవ యాత్ర

సంగం: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం సంగం మండలంలో విజయీభవ యాత్ర నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి గురువారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు పెరమన, 6.30 గంటలకు జంగాలదొరువు గ్రామాల్లో విజయీభవ యాత్ర నిర్వహిస్తారని, మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమా నులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇఫ్తార్ విందు

ఆత్మకూరు: రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో ఉపవాస దీక్ష నిర్వహించే ముస్లింలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ ప్రణీత్‌చౌదరి గురువారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఇచ్చారు. పట్టణంలోని ఉలవదిబ్బ ప్రాంతంలోని మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం జరిగిన ఇఫ్తార్ విందులో డాక్టర్ ప్రణీత్, డాక్టర్ కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సోమశిల: అనంతసాగరం మండలం లింగుగుంట గ్రామానికి చెందిన దాసరి వెంకటరమణయ్య (38) గడ్డి మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు దాసరి వెంకటరమణయ్య మూడు రోజుల క్రితం పొలాలకు వినియోగించే గడ్డి మందును తాగాడు. దీంతో కుటుంబసభ్యులు అతనిని ఆత్మకూరులోని వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

సోమశిల: అనంతసాగరం మండలం కొత్తపల్లి సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు గాయాలయ్యాయి. వివరాలు.. కొత్తపల్లికి చెందిన నరసమ్మ అనే మహిళ రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా అనంతసాగరం నుంచి ఆత్మకూరు వైపు వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు ఆమెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నరసమ్మకు గాయాలయ్యాయి. వాహనదారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం రోడ్డు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లింది. గాయపడిన నరసమ్మను ఆటోలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

భద్రతలో ఎస్ఈఐఎల్ ఆదర్శవంతం

తోటపల్లిగూడూరు : భద్రతా ప్రమాణాల విషయంలో ఎస్ఈఐఎల్ ఇతరులకు ఆదర్శవంతంగా నిలుస్తోందని ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని అనంతపురంలో ఉన్న ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (సీల్) కార్యాలయంలో జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ విజయానికి అత్యంత ప్రధానమైన భద్రతపై ఎస్ఈఐఎల్ ప్రత్యేక శ్రద్ధ చూపడం హర్షణీయమన్నారు. ప్రపంచ స్థాయి భద్రతా ప్రమాణాల కల్పనకు గుర్తింపుగా ఇండస్ట్రీయల్ సేఫ్టీ ఎక్సలెన్స్ 2023 వేడుకల్లో ఎస్ఈఐఎల్‌కు అవార్డు దక్కడం సముచితమన్నారు. అనంతరం కంపెనీలో ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించారు.

పేకాట స్థావరంపై దాడి

ముత్తుకూరు : మండలంలోని ఈపూరు శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ముత్తుకూరు ఎస్సై శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం అర్ధరాత్రి పోలీసు సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. ఐదుగురు పేకాటరాయుళ్లతో పాటు వారి నుంచి రూ.13,000లు నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గురువారం కోర్టుకు హాజరుపరిచామని తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికి లబ్ధి


రాజగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జి.చెర్లోపల్లిలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు న్యాయం జరగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాలన్నారు. టీడీపీ నేతలు, పచ్చగ్యాంగ్ చేసే అసత్య ప్రచారాలను, వాగ్దానాలు నమ్మితే 2014లో లాగా మరోసారి మోసపోవాల్సి వస్తుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య మంచి, చెడులను బేరీజు వేసుకొని ఏ ప్రభుత్వం మేలు చేసిందో ఆలోచించి వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా తీర్పు చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థినైన తనకు, నెల్లూరు ఎంపీ అభ్యర్థి అయిన విజయసాయిరెడ్డికి ఫ్యాను గుర్తుపై ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. ఇక్కడ టీడీపీ తరపున పోటీ చేసే కాకర్ల సురేష్ విదేశాల్లో ఉంటాడని, అలాంటి వ్యక్తికి ఓటేస్తే నిరర్థకమని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మోది రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి, నాయకులు గౌస్‌మొహిద్దీన్, కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, తిరుపతిరెడ్డి, కల్లూరి రమణారెడ్డి, మూలె వెంకటసుబ్బారెడ్డి, ఎం.శ్రీనివాసులురెడ్డి, గోగుల వెంకశరెడ్డి, సంజీవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని అనుసరించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ గోపీకృష్ణ

చేజర్ల: ఎన్నికల నియమావళిని ప్రభుత్వ అధికారులందరూ అనుసరించాలని తహసీల్దార్ గోపీకృష్ణ తెలిపారు. చేజర్లలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఎన్నికల నియమావళిపై సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గోపీకృష్ణ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రాగానే అధికారులు ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకూడదని తెలిపారు. ఈ కోడ్ అధికారులకు కూడా వర్తిస్తుందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల కోడ్ ప్రకటించగానే గ్రామాల్లో ప్రజాప్రతినిధుల ఫొటోలు, ఫ్లెక్సీలు తొలగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా ఈఓపీఆర్డీ రామయ్య, డీటీ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


7వ వార్డులో పర్యటిస్తున్న కమిషనర్, కౌన్సిలర్లు

ఆత్మకూరు: పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా గురువారం కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 7వ వార్డు పరిధిలో శివారు ప్రాంతంలో కాలువల్లో పూడిక పేరుకొని పోవడంతో పరిశీలించిన ఆయన రెండు రోజుల్లో తీయించే ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఆత్మకూరు మున్సిపాలిటీని స్వచ్ఛంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని, కౌన్సిలర్లు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ప్రసాద్, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు గంధళ్ల వేణు, సయ్యద్ నౌషాద్‌బేగం, రమాదేవి, నాయకులు సయ్యద్ జమీర్, చిన్నపరెడ్డి, రసూల్‌బాషా, మునీర్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి అమ్మఒడి


సరస్వతీదేవి పూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అనుమసముద్రంపేట: రాష్ట్ర ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టి విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తోందని ఏఎస్‌పేట మండలం గుడిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తిప్పిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గుడిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సరస్వతీదేవి పూజ నిర్వహించారు. పాఠశాల స్థాయిలో 10వ తగరతి పరీక్షల్లో మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.10,116 నగదు బహుమతి అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు


వలంటీర్ కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే అందజేస్తున్న వలంటీర్ల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇటీవల ఆత్మకూరు పట్టణానికి చెందిన వలంటీర్ సందా వెంకట నాగసాయి ప్రమాదవశాత్తు మృతిచెందడంతో ఆ కుటుంబానికి సీఎం సహాయనిధి ద్వారా రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం ఆత్మకూరు పట్టణంలోని తన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్ కుటుంబానికి ఆర్థికసాయం

సంగం: మండలంలోని సిద్దీపురంలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తూ దువ్వూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పవన్‌కళ్యాణ్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.5 లక్షలు మంజూరైంది. ఆ చెక్కును ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం ఆత్మకూరులోని తన క్యాంపు కార్యాలయంలో పవన్‌కళ్యాణ్ కుటుంబసభ్యులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు గుండాల బాలచంద్రారెడ్డితో కలిసి అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే చేరుస్తున్న వలంటీర్లను తన సొంతవాళ్లుగా భావించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి కుటుంబాలను ఆదుకునేందుకు రూ.5 లక్షల చొప్పున మంజూరు చేశారని తెలిపారు. రూ.5 లక్షలు మంజూరు చేయించిన ఎమ్మెల్యే మేకపాటికి పవన్‌కళ్యాణ్ కుటుంబసభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



కోవూరు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని హెచ్‌ఎం ఇందిరాదేవి తెలిపారు. కోవూరు మండలం గుమ్మలదిబ్బ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని పులిగొండ్ల దీక్ష ఇటీవల జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణించారు. ఈ మేరకు పాఠశాల ప్రాంగణంలో దీక్షను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్‌లో ఆమె మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మధుసూదన్‌రావు, పీఈటీ అజయ్ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేలా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌రావు రూ.5 వేలు, స్థానికులు సుధాకర్ రూ.3 వేలు, శ్రీనివాసులు రూ.2 వేలు ప్రోత్సాహక నగదును అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.